తన కన్నీళ్లు ఇంటినిండా కాల్వలు కట్టినా.. నాన్న గుండె కరగలేదు. అమ్మకు గుండెను రాయిగా చేసుకుని పురుషాధిపత్యానికి తలొంచక తప్పలేదు.

అజహర్ ఆటో తోల్తాడు. అద్దె ఆటో.. రెండు చిన్న గదులున్న రేకుల షెడ్‌లో కాపురం. తనకు పస్తులూ, పేదరికం కొత్త కాదు. సర్దుకునిపోయేది. కానీ, రోజూ తాగొచ్చి గొడ్డును బాదినట్టు బాదే మొగుడి విషయం లోనే సమాధాన పడలేకపోయింది.

జైలులాంటి జీవితం. చీకటి కుహరంలో కాళ్లూచే తులు కట్టేసి బంధించినట్టు.. సంకెళ్లు కాళ్లూ చేతులకే కాదు, హృదయానికి కూడా! భరించడం ఎంత దుస్స హంగా ఉందో! స్వేచ్ఛలేని జీవితం కూడా జీవితమేనా? అదేం జీవితం? మృతప్రాయమైన జీవితం.

ఒంటరిగా బైటికి వెళ్లకూడదు. వెళ్లాలనుకుంటే అజహర్ తోడుండాలి. నల్లటి బురఖాలో శరీరాన్ని కప్పు కొనే బైట అడుగుపెట్టాలి. బంధువులతో, స్నేహితులతో మాట్లాడకూడదు. వాళ్లెవ్వరూ ఇంటికి రాకూడదు. తను వాళ్ల ఇళ్లకు వెళ్లకూడదు. పెళ్లిళ్లు, శుభకార్యాలకు కూడా వెళ్లడానికి వీల్లేదు. ఎన్ని సంకెళ్లో.. కంటికి కనిపించని సంకెళ్లు!

''ఎందుకు వీల్లేదు? పంజరంలో పక్షిలా ఉండాలా?'' అని అడిగిందో రోజు.

సమాధానంగా ఒళ్లంతా వాతలు తేలేలా కొట్టాడు.

''అందంగా ఉన్నావుగా. నీ వెంట పడేవాళ్లు చాలా మంది ఉంటారు. వాళ్లలో ఎవడో ఒకడితో లేచిపోవని



గ్యారంటీ ఏంటి?'' అన్నాడు.

ఆడది కావడం, ముస్లిం కుటుంబంలో పుట్టడం, అందంగా ఉండటం.. ఇవన్నీ తన పాలిట శాపాల య్యాయి. ఇంట్లో అతను మాట్లాడిందే శాసనం. ఎదురు చెప్పకూడదు. అతను కోరుకున్న ప్రతిసారీ శరీరాన్ని అప్పగించాలి. కడుపు నొప్పిగా ఉన్నా, కాళ్లు నొప్పిగా ఉన్నా.. తప్పని, తప్పించుకోలేని నరకం. పెళ్లికి ముందు ఎన్ని కలలు కన్నదో!? ప్రేమ కదా ఉండాలి. ప్రేమతో కదా కలవాలి. మొగుడూ – పెళ్లాల మధ్య ఉండే అపు రూపమైన అనుబంధం ఏదీ? జ్వరంతో లంఘణాలు చేస్తూ పడుకుని ఉన్నా.. మొగుడు పడుకోమంటే పడుకో వాలా? శరీరాన్ని అమ్ముకునే స్త్రీకైనా స్వాతంత్ర్యం ఉంటుందేమో కానీ, తనకు మాత్రం లేదు.

ఎన్నిసార్లు అనుకుందో.. ఈ సంకెళ్లను తెంపుకొని స్వేచ్ఛగా ఎక్కడికైనా ఎగిరిపోవాలని. కానీ, ఎక్కడికని పోగలదు? నిఖా చేసి అతనింట్లో ఓ గుంజకు కట్టేశా రుగా. మొన్నటివరకు ఎన్ని కష్టాల్ని భరించిందో!? అయినా ఇప్పుడు అనిపించినట్టు.. చావాలని ఎప్పుడూ అనిపించలేదు.

* * *

నాలుగు రోజులక్రితం బిందెతో నీళ్లు మోసుకువస్తూ కళ్లుతిరిగి ఇంటిముందు పడిపోయింది. అప్పుడు అజ హర్ ఇంట్లో లేడు. పక్కింటి ఖాజావలీ పరుగెత్తుకుంటూ వచ్చి.. ఆటోలో డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లాడు. అప్పుడే తెలి సింది.. తను కడుపుతో ఉన్న విషయం!

అజహర్ ఇంటికి రాగానే.. ఎంత సంతోషంగా చెప్పిందో! అతను ఆనందంతో ఎగిరి గంతేస్తాడను కుంది. కానీ, అతని మొహం కోపంతో ఎర్రబడటం చూసి మ్రాన్పడిపోయింది.

''నా వల్లే వచ్చిందంటావా?''.. కడుపు వైపు అను మానంగా చూస్తూ అడిగాడు.

''అయ్యో.. అదేం మాట? మిమ్మల్ని తప్ప పరపురు షుడివైపు కన్నెత్తి కూడా చూడలేదే!?'' అన్నది.

''పక్కింటి ఖాజావలీగాడికి నీమీద అంత శ్రద్ధ ఎందుకో ఇప్పుడర్థమైంది. వాడివల్లే కదూ ఈ కడుపు? లేకపోతే ఆ సమయంలో వాడు ఇంట్లోనే ఎందుకు న్నాడు? కళ్లు తిరిగి పడిపోవడం నాటకం కదూ.. వాడి ఆటోలో వెళ్లడం కోసం ఆడిన నాటకం''..

ఆమె నిరుత్తరురాలైంది.

''ఆర్నెల్ల కింద నువ్వు వాణ్ని చూసి నవ్వినప్పుడే అర్థ మైంది.. మీ మధ్య ఏదో ఉందని!'' అన్నాడు.

ఆర్నెల్ల కింద ఓ రోజు.. ఉతికేసిన బట్టల్ని బైట దండెం మీద ఆరేస్తూ, రాత్రి అజహర్ కొట్టిన బెల్టుదెబ్బలు గుర్తొచ్చి, విషాదంగా నవ్వుకున్నది. ఆమెకు కొద్ది దూరంలో ఖాజావలీ నిలబడి ఉన్న విషయం తను గమ నించలేదు. కానీ, అజహర్ గమనించాడు. ఖాజావలీనే చూసి నవ్వావని ఎన్ని రోజులు పోట్లాడాడో.. తాగొచ్చి. అట్లకాడని ఎర్రగా కాల్చి, గుండెలమీద వాతలు కూడా పెట్టాడు.

''అల్లా కసం! నేనే పాపమూ ఎరుగను. కడుపులో పెరుగుతున్న బిడ్డ నీ బిడ్డే!'' అన్నది ఏడుస్తూ.

ఖాజావలీకి సొంత ఇల్లుంది. సొంత ఆటో ఉంది. అతని డబ్బు చూసి తను మోజు పడి ఉంటానని అజహర్ అనుమానం.

''నాకు తెలుసు. ఈ కడుపు వాడివల్లే వచ్చింది!'' అంటూ నానా రభసా చేశాడు.

నాలుగు రోజులు భరించింది. ఇక భరించడం తనవల్ల కాలేదు. తన కడుపు పండి బాబో – పాపో పుడితే.. తన కష్టాలు తీరుతాయని ఆశపడింది. ఇప్పుడా కడుపువల్లే మరిన్ని కష్టాలు వచ్చేలా ఉన్నాయి. బిడ్డ పుట్టకముందే ఇంత నరకం చూపిస్తుంటే.. బిడ్డ పుట్టాక ఇంకెంత నరకం చూపిస్తాడో!? బిడ్డను బతకనిస్తాడో లేదో!?

ఆ ఆలోచనకే ఆమె భయంతో వణికిపోయింది. అందుకే బిడ్డతోపాటే చచ్చిపోవడం మంచిదనుకుంది.

* * *

ఆమెకు పదడుగుల దూరం నుంచి ఎక్స్‌ప్రెస్ రైలేదో అమిత వేగంగా వెళ్లిపోవడంతో.. తుళ్లిపడి ఆలోచన ల్లోంచి బైటపడింది. ఆ శబ్దానికి ఆమె గుండె దడదడలా డింది. ఎంత ఆదమరిచి ఉందో.. ఇంకో క్షణం ఆలస్య మైతే రైలుకు నేరుగా వెళ్లి గుద్దుకునేది. అప్పుడు ఏ కాలో.. చెయ్యో.. విరిగిపోతే! అమ్మో.. ఎంత నరకం!? రైలు కిందపడి రెండు ముక్కలుగా తెగిపడాలి తప్ప.. అవిటితనంతో బతికిపోకూడదు.

ఆమెకు కడుపులో ఏదో కదిలినట్టయింది. తను భయ పడినట్టే కడుపులో బిడ్డకూడా భయపడినట్టుంది.

'పదడుగుల దూరంనుంచి రైలు వేగంగా వెళ్లిపోతేనే భయపడిన బిడ్డ.. రైలు చక్రాలు తనను రెండుగా చీలుస్తూ ఉన్నప్పుడు ఇంకెంత హింస పడ్తుందో కదా!'.. ఆ ఆలోచనకే ఆమెలోని తల్లి హృదయం తల్లడిల్లింది.

తన ప్రాణం తనిష్టం. కానీ, బిడ్డప్రాణం తీసే హక్కు తనకెక్కడుంది? లేదు. తను చావకూడదు. బిడ్డను బతి కించుకోవాలంటే తను బతికుండాలి. తన బిడ్డ కోసం అజహర్‌తోనేకాదు.. మృత్యుదేవత ఎదురొచ్చినా పోరాడి కాపాడుకోవాలి.

ఫరీదా వెనక్కి తిరిగి ఇంటికొచ్చింది.

* * *

ఆమెకు అందమైన కూతురు పుట్టింది.. ఆఫ్రీన్!

ఆఫ్రీన్‌కు ఇప్పుడు పదిహేనేళ్లు. కడుపులో ఉన్న బిడ్డను కర్కశ లోహచక్రాలకు బలివ్వకుండా అప్పుడు కాపాడుకుంది. ఇప్పుడు మరోసారి కాపాడుకోవాల్సిన అవసరం వచ్చింది. కాపాడుకుంటుంది. తన ప్రాణాల్ని పణంగా పెట్టయినా కాపాడుకుంటుంది.

ఏమైనా సాయం చేస్తాడన్న ఆశతో తన కష్టాలు తమ్ముడితో చెప్పుకొన్నది.

''ఆఫ్ఘనిస్తాన్‌లోని ఆడవాళ్లతో పోలిస్తే నువ్వు చాలా అదృష్టవంతురాలివి ఆపా!''.. అంటూ తాలిబన్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా టీవీలో వచ్చిన కథనాల్ని పూసగుచ్చినట్టు చెప్పాడు.

ఫరీదా విషాదంగా నవ్వుకుంది. ఆ కష్టాలన్నీ తన జీవి తంలో కూడా ఉన్నాయి. తనలా ఇంకెంతమంది ముస్లిం స్త్రీలు అటువంటి దుర్భర జీవితాల్ని గడుపుతున్నారో.. ఆఫ్ఘనిస్తాన్‌లో దారుణాలు జరుగుతున్నాయి సరే.. మరి ఇక్కడెందుకు జరుగుతున్నాయి? ఎవరు బాధ్యులు? ఆఫ్ఘనిస్తాన్‌లో కంటే ఇక్కడి ముస్లిం స్త్రీల జీవితాలు ఏం మెరుగ్గా ఉన్నాయని!?..

ఆమె పక్కనే చాప మీద పడుకుని ఉన్న ఆఫ్రీన్..

''అమ్మీ.. నాకు భయమేస్తున్నది'' అనడంతో ఫరీదా ఆలోచనల్లోంచి బైట పడింది.

''భయం దేనికి? నేనున్నానుగా. ధైర్యంగా ఉండు'' అన్నది పక్కకు వత్తిగిలి, తన కూతురి మీద చేయి వేస్తూ.

''అబ్బాజాన్ నీ మాట వినడు. నన్ను ఆ ఫరూక్ గాడి కిచ్చి నిఖా చేస్తాడు. ఎలా తప్పించుకోవాలో తెలియడం లేదు. పారిపోదామా?''.. సన్నగా ఏడుస్తూ అన్నది.

''పారిపోవడం పిరికివాళ్ల లక్షణం. మనం ఇక్కడే ఉండి పోరాడుదాం. నన్ను నమ్ము బేటీ! నిశ్చింతగా ఉండు'' అన్నది ఫరీదా.

నాన్న ఎంత మొండివాడో ఎంత కర్కోటకుడో తెలిసి కూడా అమ్మ అంత నిబ్బరంగా ఎలా ఉందో ఆఫ్రీన్‌కు